(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

<u>విశ్వజనీయత</u>

సాధారణంగా నవలలు రెండు రకాలు. ఒకటి పాఠకుల నమ్మకాల్ని బాగా బలపరచేవి. రెండు పాఠకులు నమ్మిన విషయాల్ని ఎదుర్కొని తార్కికంగా వాదించేవి.

సాధారణంగా కొత్త రచయితలెప్పుడూ మొదటి విభాగానికి చెందిన రచనలు చేయటమే మంచిది. రచనకి విశ్వజనీయత ఉన్నంత కాలం రచయిత యొక్క బాధ్యత తగ్గుతుంది. ఉదాహరణకి, రామాయణంలో రావణాసురుడి కొలువులో సీత అన్నాళ్ళున్నా కూడా తన శీలం కోల్పోలేదని, రాముడి మీద నమ్మకంతో అశోక వృక్షం కింద ఎదురు చూస్తూంది అని వ్రాయటం విశ్వజనీయత ఉన్న సిద్ధాంతం.

పాఠకుల యొక్క నమ్మకాన్ని బలపరచటం అంటే ఇదే ఒక ధీరోదాత్తుడైన హీరో, కేవలం క్రూరత్వం మాత్రమే ఉండే విలన్, అమాయకత్వమో, అపురూపమైన తెలివితేటలో ఉండే హీరోయిన్... ఇలాంటి స్టాక్ క్యారెక్టర్స్‌తో, ఇలా జరిగితే బావుణ్ణనిపించే సంఘటనలతో నవల వ్రాసుకుంటూపోతే అది పాపులర్ అయ్యే అవకాశం ఎక్కువ ఉంది.

సీత రాముడి కోసం ఎదురు చూడలేక రావణుడికి అర్ధాంగి అవటానికి ఒప్పుకున్నట్టు ఒక రచయిత వ్రాయటానికి ప్రయత్నం చేశాడనుకోండి. ఎన్నో నెలలు రాముడి కోసం చూసీ చూసీ రకరకాలైన మానసిక విశ్లేషణలతో, సందిగ్ధంతో, రాముడి మీద అపనమ్మకంతో విసిగి వేసారిపోయిన సీత రావణాసురుడ్ని ఆశ్రయించింది అని రచయిత వ్రాస్తే, చాలామంది పాఠకులు ఒప్పుకోరు. వాళ్ళయొక్క అహంకానీ, మేధస్సుకానీ, జ్ఞానం కానీ అందుకు సిద్ధపడి ఉండదు. ఎన్ని ఏళ్ళయినా పాతివ్రత్యం అనే నమ్మే మనుషులం మనం. ఎవరైనా రచయిత సీత యొక్క మానసిక విశ్లేషణాన్ని మరొక కోణంలోంచి పరిశీలించి, ఒక స్త్రీ వస్తాడో రాడో తెలియని తన భర్తకోసం అన్నేళ్ళు ఎందుకు ఎదురు చూడాలి అని వ్రాయాలంటే అతడు చాలా ఆయుధ సామాగ్రిని పోగుచేసుకుని పాఠకులని కన్విన్స్ చెయ్యటానికి ప్రయత్నించాలి. ఎంత చేసినా కూడా విశ్వజనీయత లేని ప్లాట్స్ సాధారణంగా మేధావుల లైబ్రరీలలో మగ్గటానికి తప్ప పాపులర్ రచనలుగా నిలబడవు. పురాణకాలం నుంచీ కావ్యాలలోనూ, కథల్లోనూ ఈ విధమైన లక్షణం మనం గమనించవచ్చు. హీరో అనగానే అతడు ధీరోదాత్తతతో కష్టాల్ని ఎదుర్కొనేవాడుగానూ మిగతావాళ్ళు అతణ్ణి ఒక అన్నలాగానో, ప్రియుడిలాగానో ఊహించుకునేవాడుగానూ ఉంటాడు. అలాగే విలన్స్ అనగానే వారిలో ఏ కోశానా మంచితనం కనబడదు.

రావణాసురుడిలో కూడా మంచితనాన్ని చూపిస్తూ అతడి వాదననీ, మనోవిశ్లేషణనీ ఒకరిద్దరు సినిమా దర్శకులు విజయవంతంగా చూపించగలిగారు. అలా చూపించాలీ అంటే ఎంతో నిపుణత, సమర్ధత అవసరం. ఆ స్థాయికి చేరుకున్న రచయితకి ఇదంతా సులభం అవుతుందేమోకానీ అప్పటివరకూ (పాపులర్ రచనలు చేయాలంటే) అందరూ అనుసరించేమార్గంలో పోవటమే మంచిది.

## సమాజాన్ని ప్రతిబింబిచే ఇతివృత్తాలు

చాలామంది మేధావులు, విమర్శకులు, గొప్పవాళ్ళు మీటింగులు పెట్టి మంచి కథ, నవలలు అదృశ్యమైపోతున్నాయనీ, పాఠకుల బలహీనతల మీద ఆడుకునే రచనలు పుంఖానుపుంఖంగా వస్తున్నాయనీ చర్చిస్తూ ఉంటారు. ఈ చర్చ ఈ నాటిది కాదు. గోపీచంద్ కూడా ఈ విమర్శకుల బారినపడ్డట్టు తరచూ తన రచనల్లో ప్రస్తావించేవాడు. అంతకు ముందు తరంలోనూ, చివరికి అల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణ కాలంలో కూడా సాహిత్యం పాడైపోతుంది అన్న విమర్శ ఉంటూ వచ్చింది.

పాఠకుల్ని పాడుచేసే రచనలూ, వాళ్ళ మనసుల మీద చెడు ప్రభావాన్ని చూపించే రచనలూ చేయకుండా కూడా పాపులర్ రచనలు వ్రాయవచ్చు. పాపులర్ రచన అంటే అది తప్పనిసరిగా పాఠకులకి హానిచేస్తుంది – అన్న అపప్రథ మేధావుల్లో ఉండటం దురదృష్టకరం.

ఆమాటకొస్తే ఒక మనిషి ఎలా బ్రతకాలి, ఎలా కష్టపడాలి అన్న కథాంశంతో వచ్చిన నవలలన్నీ పాపులర్ నవలా విభాగంనుంచి వచ్చినవే.

అసలు రచనలు ఎవరికోసం? చదివేవాళ్ళ కోసం! విద్యావంతుల కోసం! అందువల్ల వాళ్ళకి తమ రచనల ద్వారా అవగాహన కల్పించటమే రచయితల లక్ష్యం. వాళ్ళ పరిధిలో వాళ్ళు ఇంకా బాగా బ్రతకటానికి ఏం చెయ్యాలి అని రచయిత సూచించినా కూడా అది సమాజానికి సహాయం చేసే రచనే అవుతుంది.

మంచి రచన అంటే కేవలం సమాజంలో జరిగే చెడు గురించి చెప్పేది, లేదా బడుగు వర్గాల గురించి, పీడిత ప్రజల గురించి, వర్గపోరాటం గురించి మాత్రమే అనే అపోహ కొంత మంది కుహనా మేధావుల్లో ఉండటం దురదృష్టకరం. సమాజాన్ని ప్రతిబింబింపచేసే మంచి రచనలు, మిగతావన్నీ అసలు రచనలే కావు అని వీరు వాదిస్తూ వుంటారు. ఒక మనిషి యొక్క బలహీనతల మీద ఆడుకొనిగానీ, అతనిలోని పైశాచిక ప్రవృత్తినీ, నేరపు మనస్తత్వాన్నీ పెంపొదించేరచనలు కానీ చెయ్యటం క్షమార్హం కాదు. కానీ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తూ అందమైన జీవితాన్ని చిత్రీకరించటం నేరం కాదు. ఆహ్లాదం కోసం సినిమా చూసినట్టే ఆనందం కోసం చాలా మంది పాఠకులు నవల చదువుతారు. ఏ విషమైన చెడూ కలగజేయకుండా పాఠకులకి ఒక మంచి స్వాప్నిక జగత్తును చూపించటం కానీ, తాము కలల్లో ఊహించుకునే విజయాల్ని రచనల్లో హీరో ద్వారా చేయించటం కానీ తప్పెలా అవుతుందో ఎప్పుడూ అర్థం కాదు. ఈ విషయం పట్ల మేధావులనబడేవారికీ పాపులర్ రచయితలకీ నిరంతరం ఘర్షణ జరుగుతూనే ఉంటుంది.

పాపులర్ రచనలు చేస్తూ కూడా మంచి రచనలు చెయ్యొచ్చు. అసలు ఇది మంచి రచన, ఇది పాపులర్ రచన అని విడగొట్టే గీత ఏదీ ఎక్కడా లేదు.

ఇటీవల కొందరు రచయితల్లో "మంచి రచన" అంటే దాన్లో ఏమాత్రం శృంగారం కానీ, భీభత్సం కానీ, సస్పెన్స్ కానీ ఉండకూడదు అనే భావం పెంపొందటం కూడా దురదృష్టకరమే. రసానుభూతి లేని ఏ నవలా సాహితీ చరిత్రలో బ్రతికి బట్టకట్టలేదు. చివరికి సమాజాన్ని యధాతథంగా చూపించే రచనల్లో కూడా ఆర్ద్రత ఉండబట్టే అవి సాహితీ చరిత్రలో నిలబడ్డాయి. కేవలం బీదవాళ్ళ కష్టాలు కానీ, డబ్బున్న వాళ్ళ కర్కశత్వంగానీ చూపించివుంటే – అవి ఆ విధంగా శాశ్వతత్వాన్ని ఆపాదించుకుని ఉండేవి కావు.

## పచ్చి నిజాలు, మెచ్చని అంశాలు

పాపులర్ నవలా రచనకి పాపులర్ అంశాలే ప్రధానంగా ఉండాలి. క్లిష్టత ఎక్కువ ఉండకూడదు. ఒకవేళ క్లిష్టత ఎక్కువ ఉన్నా కూడా, అది పాఠకులు మెచ్చే అంశాన్ని సపోర్ట్ చేసేదే అయ్యుండాలి తప్ప పాఠకుల అహాన్ని దెబ్బతీసే విధంగా కానీ, వాళ్ళ యొక్క సిద్ధాంతాల్ని కించపరిచేదిగా కానీ, వాళ్ళ నమ్మకాల్ని హేళన చేసేదిగా కానీ అయ్యుండకూడదు.

దీన్నే 'షుగర్ కోటింగ్' అంటారు.

ఒకవేళ రచయిత పాఠకులు మెచ్చని అంశాన్ని నవలలో ప్రధానాంశంగా తీసుకోవాలనుకున్నా కూడా, ఆ అంశపు ముగింపు మళ్ళీ పాఠకులకి నచ్చే విధంగా ఉంటేనే ఆ నవల పాపులర్ అవుతుంది. ఇది 'అంతర్ముఖం' నవలలో నాకు అనుభవానికి వచ్చింది. మానవ సంబంధాలన్నీ మెటీరియలిజం మీదే ఆధారపడతాయని అంతర్ముఖంలో నేను స్పష్టంగా చెప్పదల్చుకున్నాను. కానీ, అలా చెప్పి ఉంటే ఆ నవల ఒక్క కాపీ కూడా అమ్ముడుపోయి ఉండేది కాదు. అందువల్ల ప్రణవి పాత్ర ద్వారా చివర్లో మళ్ళీ లౌకికానికి అతీతమైన ప్రేమ ఒకటుంది అని భగవంతుడి ముందు చెప్పించటం ద్వారా పాఠకుల అభిమానాన్ని ఆ నవల పొందగలిగింది. ఈ విషయాన్ని ఇదే అనుబంధంలో 'రచయిత సొంత అభిప్రాయాలు' అన్న ప్రకరణలో మరింత వివరిస్తాను.

'లేడీస్ హాస్టల్' అనే నవల, హాస్టల్లో ఉండి చదువుకునే అమ్మాయిలకి బాగా నచ్చుతుందని "ఇది మన దైనందిన చర్యే" అని వాళ్ళనుకుంటారని ఆ నవల వ్రాయబోయే ముందు నేను భావించాను కానీ, హాస్టల్లో ఉండే అమ్మాయిలు కానీ, వాళ్ళ మిత్రురాండ్రు కానీ ఆ నవలని అంతగా మెచ్చుకోలేదు. దానికి కారణం ఏమిటంటే కొన్ని హాస్టల్స్ తాలూకు పచ్చినిజాలు, చేదు నగ్న సత్యాలు అందులో కూలంకుషంగా వివరింపబడ్డాయి. ఇటువంటి హాస్టల్లోనా మేమంటున్నది అనుకోవలసిన అమ్మాయిలు కూడా, ఇది మనకు సంబంధించిన కథ కాదులే అనుకోవటం వల్ల ఆ నవల క్లిక్ కాలేదు. అందులో రొమాన్స్ కన్నా రొమాన్స్ పేరిట చిన్న పిల్లలు చేసుకునే ఆత్మవంచన ఎక్కువగా చిత్రీకరింపబడింది. ఇలాంటి చేదు నిజాలు పాపులర్ రచనకి పనికిరావు అని ఆ నవల వ్రాయటం ద్వారా నేను తెలుసుకున్నాను.

అయితే కేవలం పాపులర్ రచనలు మాత్రమే చేయుటం రచయిత లక్ష్యమా, నిజం చేదుగా ఉన్నా సరే అది పాఠకులకి చెప్పవల్సిన బాధ్యత రచయితకి లేదా? అని విమర్శకులు ప్రశ్నించవచ్చు. అటువంటి బాధ్యత రచయిత మీద తప్పనిసరిగా ఉంది! అయితే చేదు నిజాన్ని చేదుగా ప్రజెంట్ చేయకపోవటమే పాపులర్ నవలా లక్షణం. చేదు నిజాన్ని చెబుతూ కూడ దాన్ని అందంగా ఒక ఫ్రేములో బిగించవచ్చని 'లేడీస్ హాస్టల్'లో ఫెయిల్ అయిన నేను 'ప్రేమ' నవల సక్సెస్ ద్వారా తెలుసుకున్నాను.

<u>అనవసరమైన విషయాలు</u>

ఒక నవల వ్రాస్తూ ఉండగా కొన్ని అనవసరమైన పాత్రలు, అవసరమైన సంఘటనలు అందులో చొచ్చుకుపోవటం తప్పనిసరి! ఎంత చేయితిరిగిన రచయితకైనా ఒకోసారి ఈ అనవసరమైన ఆతిథ్యం తప్పదు.

పాపులర్ రచన అంటే కేవల సస్పెన్స్ థ్రిల్లర్ మాత్రమే కాదు. రచయిత తనకి తెలిసిన విషయాలు కొన్ని పాఠకులకి చెప్పాలి. అలాగే తన అభిప్రాయాలు కూడా వెల్లడించాలి. అలా చెపుతున్నప్పుడు ఒక్కొక్క పాత్ర పట్ల రచయిత బాగా మోహపడితే ఆ పాత్ర అవసరం నవలలో ఎక్కువ లేకపోయినా దాని స్వభావాన్ని, మనస్తత్వాన్నీ ఎక్కువ విశ్లేషించటం కూడా జరుగుతుంది. అదే విధంగా కొన్ని సంఘటనలు వ్రాస్తున్నప్పుడు, తనకి తెలిసిన మరికొన్ని విషయాలు పాఠకులకి చెప్పాలనిపిస్తుంది. కథకి సంబంధం లేని పాత్రల్ని ఇష్టపడి, ఇటీవల తన అభిప్రాయాల్లో వచ్చిన మార్పుల్ని - పాత్రల మధ్య వాదోపవాదాలుగా సృష్టించటం ద్వారా పేజీలకు పేజీలు వ్రాస్తూపోతే ఆ రచయిత పాపులారిటీ కోల్పోతాడు. అలా అని కేవలం చకచకా కథే వ్రాస్తూపోతే అది చాలా సాధారణ నవల అవుతుంది. జీవితం పట్ల రచయిత దృక్పథం పాఠకులకి తెలియాలి. రచయిత విషయ పరిజ్ఞానం పాఠకులకి తెలియాలి. మళ్ళీ ఇలాగని - తెలిసినదంతా చెప్పకూడదు.

ఒక స్టేజి వచ్చేసరికి రచయిత తెలిసినదంతా చెప్పకుండా తనని తాను నియంత్రించుకునే శక్తి కోల్పోతాడు. దీన్నే 'ఛాదస్తం' అంటారు. ఈ ఛాదస్తం రచయితకి వయసుతోనూ, అనుభవంతోనూ, ఎక్కువవుతూ ఉంటుంది. తాను నమ్మిన సిద్ధాంతాలే కరెక్టనీ, తనకి నచ్చిన అభిప్రాయాలే పాఠకులందరికీ నచ్చుతాయనీ ఎప్పుడయితే రచయిత అనుకోవటం ప్రారంభిస్తాడో - ఆ క్షణం నుంచీ అతడు కేవలం ఒక వర్గానికే పరిమితమైపోయి, పాపులారిటీ కోల్పోతాడు. వయసుతోపాటు వివేకం పెరగాలి. తాను నమ్మిందే సిద్ధాంతం అన్న

మూర్ఖత్వం తగ్గాలి. అయితే "ఎప్పుడూ కేవలం పాఠకులకోసమేనా వ్రాయవలసింది, తన సొంత అభిప్రాయాలు చెప్పే హక్కు కూడా పాపులర్ రచయితకి లేదా" అని మీరు ప్రశ్నించవచ్చు. పాపులర్ రచనలో వీలైనంతవరకూ కథాగమనమే ముఖ్యాంశంగా ఉండాలి తప్ప, రచయిత డామినేషన్ ఎక్కువ ఉండకూడదు. డామినేషన్ ఎక్కువవుతున్న కొద్దీ రచయిత పాఠకుల్ని కన్విన్స్ చెయ్యటం మొదలుపెడతాడు. ఇందులో చాలా రిస్క్ ఉంది. అయితే పాఠకులు రచయిత యొక్క అభిప్రాయాలకు కన్విన్స్ అయితే మాత్రం అప్పుడు ఆ రచయిత పరిణితి చెందినట్టే. పాపులారిటీతోపాటు అతడిని ప్రజలు మంచి రచయితగా గుర్తించటం ప్రారంభిస్తారు. రచయితకి తన బాధ్యత అర్థమవుతుంది. తన విజ్ఞానాన్ని పదిమందికీ పంచాలన్న తపన ఎక్కువవుతుంది. ఒకప్పుడు చాదస్తం అనుకున్నదే - చరిత్రలో అతనిని మంచి రచయితగా నిలబెడుతుంది.

ఇవన్నీ నా అభిప్రాయాలు కావు. ప్రముఖ రచయిత గోపీచంద్ అభిప్రాయలు. ఆయన వ్రాసిన మాటల్ని ఈ క్రింద యధాతధంగా పొందుపరుస్తాను.

"....ఇంతకు ముందు నా కథల్లో కానీ, నవలల్లో కానీ గమ్యస్థానానికి వేగంగా తీసుకువెళ్ళే సంఘటనల్నే ఏరుకుంటూ ఉండేవాడిని. అంతేకాదు, ఆ వేగానికి దోహదం ఇచ్చేంతవరకే ఆ సంఘటనల్ని ఉపయోగించుకుంటూ ఉండేవాడిని. ఇప్పుడలా చేయబుద్ధికాదు. తప్పుకోటానికి ఎంత ప్రయత్నించినా, మానవ జీవితానికి ఉన్నట్లే రచనా విధానానికి కూడా ఒక చట్రం ఉండక తప్పదు. ఎప్పుడైతేమనం ఒక చట్రాన్ని నిర్మించుకున్నామో అప్పుడే దానిలో ఇమడని జీవితం అంటూ ఒకటి ఉండక తప్పదు. అందువల్ల మనం చేయగలిగింది ఒక్కటే. జీవితాన్ని వీలైనంత సమగ్రంగా ప్రదర్శించటానికి అనువైన పెద్ద చట్రాన్ని నిర్మించుకోవటం... లేకపోతే... మన మనసులో ఏర్పడి ఉన్న చట్రాన్ని వీలైనంతవరకూ వదులు చెయ్యటం.

ఈ భావం పెరుగుతూ వచ్చిన కొద్దీ నా కథాకథనంలో బిగువు తగ్గుతూ వచ్చింది. అలా తగ్గటం వల్ల ఏర్పడిన ఖాళీ స్థలంలోకి జీవితం చొచ్చుకురావటం ప్రారంభించింది. అలా చొచ్చుకుకు రావటానికి ప్రయత్నించే జీవితపు తాపత్రయం నాకు చూడముచ్చటగా ఉండింది.

ఏక ముఖం, బిగిసిన ముఖం కలిగిన విమర్శకులు నా ఈ మార్పుకి కారణాలు వెతికి, వారి వారి స్థాయిలను బట్టి ఉచితమైన కారణాలు ఊహించేసుకున్నారు. కానీ, చట్రం సడలటం వల్ల వచ్చిన నష్టం ఏముంది? ముఖ్యంగా ఆ సడలింపు ఒక ప్రయోజనాన్ని సాధించటానికి జరుగునప్పుడు లాభమే కదా?

కుదింపు లేనంత మాత్రాన ప్రతీ రచనలోకి ఏ సంఘటన పడితే ఆ సంఘటనను చొప్పించటం సమర్థిస్తున్నాను అని అనుకోవటం అపోహ.

రచనా విధానంలోని ఈ రకమైన సడలింపు రచయితకు అనుభవం, వివేకం పెరగటం వల్ల వస్తుందని నేను అనుకుంటున్నాను. జీవితానుభవం ఎక్కువవుతున్నకొద్దీ మన దృష్టి ఎంత సమగ్రమైందో మనకి తెలుస్తుంది.

వివేకం హెచ్చిన కొద్దీ మనం నమ్మినదాని కంటే ఈ ప్రపంచంలో ఇంకో దృష్టి ఉండటానికి వీల్లేదనే అహం నశిస్తుంది.

అప్పుడు మనం ఏదో ఒక అర్థ సత్యాన్ని పాఠకుల మీద రుద్దలేం. ఆ స్థాయిలో జీవితాన్ని బహు రంగులుగా చిత్రీకరించబుద్ధి అవుతుంది. అప్పుడు జీవితం మనం గీసుకున్న సరిహద్దుల్ని దాటి ఒంగి పొర్లుతుంది.

ఇది రుజువు కాబడిన సత్యం.

ఈ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో ప్రచురించబడిన రెండు గ్రంధాలు చదువరుల దృష్టినీ, మేధావుల దృష్టినీ ప్రబలంగా ఆకర్షించినాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి మాలపల్లి, గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం.

ఈ రెండు గ్రంధాలూ కూడా జీవితాన్ని బహు రంగులుగా ప్రదర్శించాలనే తహ తహ కొద్దీ 'సడలింపబడిన రచనా విధానం' కలవే. మాలపల్లిలో చాలా అధ్యాయాలు అనవసరమనీ, కన్యాశుల్కంలో చాలా రంగాలు అనవసరమనీ అనే వారిని నేను అనేకమందిని ఎరుగుదును. కానీ వారే వాటిని ఉత్తమ గ్రంధాలు అనటం కూడా నేనెరుగుదును. అనవసరంగా చొప్పించబడిన కథాంశాలున్న ఈ గ్రంధాలు ఉత్తమ గ్రధాలు ఎలా అయ్యాయి అంటే, మనం అనుకునే వాటిని మించిన ఆకర్షణ ఏదో ఆ గ్రంధాల్లో ఉండి ఉండాలి.

ఈ గ్రంధాల ప్రసక్తి వచ్చినప్పుడు నా మిత్రుడొకడు ఈ గ్రంధాలను ఒక్కొక్కదాన్ని వంద పేజీల్లోకి కుదించవచ్చు అన్నాడు. ఆ లెక్కలో దేన్నైనా కుదించవచ్చు. నా మిత్రుడి వాక్యాన్ని కూడా కుదించవచ్చు. అలా కుదించినపుడు కండ తరిగి వట్టి అస్థిపంజరం మాత్రమే మిగులుతుంది.

జీవితం విరజిమ్మే రంగులు అనుభవంలోకి వచ్చినకొద్దీ వాటిని చదువరులకు ప్రదర్శించాలనే కుతూహలం ఎక్కువవుతుంది. ఆ కుతూహలం ఎక్కువైనకొద్దీ రచనా విధానం మెత్తనవుతుంది. ఇది చట్రం ఉద్దేశ్యపూర్వకంగా సడలించటం వల్ల వచ్చే ప్రయోజనం.

సాహిత్యానికి ఇంతకంటే పెద్ద ప్రయోజనం ఏముంటుంది? ".

✷✷✷

గోపీచంద్ బాగా పరిణితి చెందిన తర్వాత ఈ అభిప్రాయానికి వచ్చి ఈ విధంగా వ్రాశారు. కానీ మనం ఇక్కడ చర్చిస్తున్నది కేవలం పాపులర్ రచనలు చేయటం ఎలా అన్న విషయమే కాబట్టి రచయిత తన అభిప్రాయాల్నీ, మారుతున్న తన సంక్లిష్టభావాల్నీ రచనల్లో ఎలా చొప్పించాలి అన్న విషయం గురించి ఎక్కువ చర్చించనవసరం లేదు. ఎందుకంటే, ఆ స్థాయికి చేరుకున్న రచయితకి ఇలాంటి పుస్తకపు అవసరం ఇక ఏ మాత్రం ఉండదు.

పోతే ప్రతీ రచయితా తను ఆ స్థాయికే చేరుకున్నాను అని తనలో తాను అనుకుంటుంటాడు. ఇలాంటి మనస్తత్వాల గురించి రచయిత - మేధస్సు అనే ప్రకరణలో తర్వాత వివరిస్తాను.

## అనుసరణలు, అనువాదాలు

ఇటీవల కాలంలో తెలుగు పాపులర్ నవలల్లో చాలా భాగం ఇంగ్లీషు నవలలకి అనుసరణలు అన్న అపప్రధ కొంతవరకూ ఉంది. ఇందులో కొంత నిజం కూడా ఉంది.

అనువాదాలైతే రచయితలు ఎలాగూ ఆ విషయం పాఠకులకి తెలుపుతున్నారు. కానీ, అనుసరణ విషయం వచ్చేసరికి చాలామంది రచయితలు ఆ విషయాన్ని పాఠకులకి తెలపటం లేదు. అది తమ సొంత ఊహ క్రిందే నవల వ్రాస్తున్నారు. ఇంకొంతమంది రచయితలైతే మరింత ముందుకెళ్ళి, తమ జీవితంలో తటస్థపడిన యదార్ధ వ్యక్తి కథ ఆధారంగా అనో, ముందు వాక్యంలో చెప్పుకుని ఆ తరువాత ప్రఖ్యాత ఇంగ్లీషు రచయితల నవలలు యధాతథంగా వ్రాస్తున్నారు.

ఏదైనా ఒక ఆంగ్ల రచయిత యొక్క పుస్తకాన్ని ప్రేరణగా తీసుకుని ఒక నవల వ్రాసినప్పుడు, ఆ విషయాన్ని ముందు మాటలోనే పాఠకులకి చెప్పివేయటం మంచి పద్ధతి. దీనివల్ల రచయిత పాపులారిటీ ఏమాత్రం తగ్గదు. రచయితకి జరిగే నష్టంకూడా ఏమీ ఉండదు.

ప్రార్ధన, దుప్పట్లో మిన్నాగు, తులసీదళం లాంటి నవలలు నేను ఇంగ్లీషు చిత్రాల, పుస్తకాల ప్రేరణతో వ్రాసినవే. ఆ విషయాలన్నీ ఆ పుస్తకాల ఉపోద్ఘాతాల్లో వ్రాయటం వల్ల నా మార్కెట్‌కి ఏ నష్టమూ జరగలేదు. వర్ధమాన రచయితలకు ఒక అనుమానం రావచ్చు. ఈ విధంగా ఫలానా ఆంగ్లనవలల ప్రేరణతో వ్రాసింది అని వ్రాయటం ద్వారా (ఈ రచయితకి స్వంత ఆలోచనంటూ ఏమీ లేదు. ఇంగ్లీషు నవలలన్నీ కాపీ కొడతాడు) అన్న విమర్శ రావచ్చు కదా అని.

రచయిత పాపులర్ అయ్యేకొద్దీ ఏదో ఒక విమర్శ ఏదో ఒక వైపునుంచి వస్తూనే ఉంటుంది. అయితే మనం వ్రాసేది కేవలం పాఠకుల కోసమే తప్ప విమర్శకుల కోసం కాదు. రచన బావుంటే పాఠకులు చదువుతారు. బాగోలేకపోతే చదవరు. మేధావులైన

పాఠకులకి ఏది స్వంత రచనో, ఏది అనుసరణో తప్పకుండా తెలుస్తుంది. అలాంటి పాఠకులకి మాత్రమే మనం జవాబుదారి. ఫలానా రచన ఫలానా ఇంగ్లీష్ పుస్తకం ప్రేరణగా వ్రాయబడింది అని వ్రాయటం ద్వారా ఈ మేధావి పాఠకుల ముందు కూడా రచయిత తన నిజాయితీ నిరూపించకోవచ్చు. అన్నీ తన స్వంత రచనలేఅని తనని తాను ఆత్మవంచన చేసుకోవటం కంటే ఇది మంచి పద్ధతి. ఎందుకంటే, ఒకవేళ రచయిత ఏ రచనైనా మరో భాష నుంచి ప్రేరణ పొందితే అది అతడి పుస్తకంలో వ్రాయకపోయినా పాఠకులలో ఒకరిద్వారా ఒకరికి సులభంగా పాకిపోతుంది. అప్పుడు రచయిత పని కళ్ళు మూసుకుని పాలు తాగిన పిల్లిలా ఉంటుంది. ఇలాంటి రచయితలు తెలుగు పాపులర్ నవలా సాహిత్యంలో కొంతమంది ఉండటం దురదృష్టకరం.

ఇతర భాషా నవలల ప్రేరణతో తెలుగులో పాపులర్ నవలలు వ్రాయటం వర్ధమాన రచయితలకి అంత మంచి పద్ధతి కాదు. ఒరిజినల్ ఎప్పుడూ ఒరిజినలే. అదీకాక, ఇంగ్లీషు వాతావరణానికీ, తెలుగు వాతావరణానికీ చాలా తేడా ఉంది. దాన్ని పూర్తిగా మార్చి తెలుగుతనం ఆపాదించటం కంటే, సొంతంగా ఆలోచించి వ్రాసుకోవటమే సులభం. అదీగాక, పది ఒరిజినల్ నవల్స్ వ్రాసి ఆ తరువాత ఇంగ్లీషు ఎక్కువగా ఇతర భాషాసాహిత్యం మీద ఆధారపడితే ఒరిజినాలిటీ క్రమేణా చచ్చిపోతుంది. కాబట్టి, వీలైనంతవరకూ అనుసరణలూ, ప్రేరణలూ తగ్గించుకోవటమే మంచిది.

సులభ పద్ధతికి అలవాటుపడిన తరువాత కష్టపడటం పట్ల ఆసక్తి తగ్గిపోవటం సహజమే కదా! దానికి ప్రత్యక్ష ఉదాహరణ క్రమక్రమంగా మార్కెట్ కోల్పోతున్న ఒక పాపులర్ రచయిత!

<u>ప్రి - క్లైమాక్స్</u>

కథకి ప్రి - క్లైమాక్స్ పాఠకుడిని మానసికంగా "ముగింపు" కోసం ప్రిపేర్ చేయటంలాటిది. ప్రారంభంలో వేసిన ముళ్ళు విప్పటం ప్రారంభమయ్యేది ఇక్కణ్ణుంచే.

కథ ప్రారంభంలో పాత్రల మధ్య ప్రారంభమైన పాయింటు సాగి, చివరికి ముగింపుకు చేరుకుంటుంది. ఈ "పాయింటు" అనేది చాలా రకాలుగా ఉంటుంది.

1.హీరో - విలన్‌ల మధ్య ఘర్షణ (రుద్రనేత్ర)
2. హీరో - హీరోయిన్‌ల మధ్య అపార్థం (సెక్రటరీ)
3. రెండు మంచి పాత్రల మధ్య సిద్ధాంత ఘర్షణ (పర్ణశాల)
4. ఒక పాత్రలో పరిణామక్రమం (ఋషి)
5. ట్రాజెడీ (వెన్నెల్లో ఆడపిల్ల)
6. ఒక సిద్ధాంత చర్చ (ప్రేమ)

ఇంతే, ఇలాటి పాయింట్లు పదో పన్నెండో ఉంటాయి. ప్రతీ నవల ఇలాటి చట్రంలోనే ఉంటుంది.

నవల ప్రారంభంలోనే అది ఏ విభాగంలోకి వస్తుందో - దానికి సరిపడా "ముడులు" బిగించాలి.

నవలంతా ముడివేయటం - వాటిని బిగించటం - ఇంకా బిగించటం - పాత్రల్లో పరిణామక్రమం - ఇలా సాగాలి.

మొదటి ముడివిప్పటంతో ప్రి - క్లైమాక్స్ ప్రారంభం అవుతుంది.

ప్రి - క్లైమాక్స్ సరిగ్గా లేకపోతే నవల చప్పున అయిపోయిన ఫీలింగ్ కలుగుతుంది. ఇది చాలా ప్రమాదకరం.

<u>క్లైమాక్స్</u>

ఒక నవలకి ప్లాట్ ఎంత ముఖ్యమో, క్లైమాక్స్ అంత ముఖ్యం. ఆ మాటకొస్తే మరీ ముఖ్యం.

ఒక సినిమా చూసిన ప్రేక్షకుడు బయటికి వెళ్ళినపుడు ఆ సినిమా తాలూకు చివరి అరగంట ప్రభావం అతడి మీద చాలా

ఉంటుంది. సినిమా మొదట్లో బావుండి చివరికొచ్చేసరికి బోరు కొడితే అది ఫ్లాప్ అవటం ఖాయం. అందుకే ఫస్ట్ హాఫ్ బావున్న చిత్రాలు సాధారణంగా ఫెయిల్ అవటం మనం గమనిస్తాం.

నవల కూడా అంతే. ఆఖరి పేజీ మూసేయగానే పాఠకుడికి ఏ అభిప్రాయం కలుగుతుందో, ఆ అభిప్రాయమే నవల మొత్తం మీద కలుగుతుంది. నవల ప్రారంభం, క్లైమాక్స్ బావుండి ప్లాట్ ఏ మాత్రంబావున్నా ఆ నవల హిట్ కింద లెక్కే. ఒక పుస్తకం చదవటం పూర్తి కాగానే పాఠకుడు చాలా గొప్పగా ఫీలయితే అదే అభిప్రాయాన్ని తన తోటవారికి చెపుతాడు. ఈ విధంగా ఆ పుస్తకం యొక్క ప్రభావం చివరి పేజీల మీదే ఆధారపడి ఉంటుందని చెప్పటానికి ఏ విధమైన సంశయం అక్కరలేదు.

దురదృష్టవశాత్తు క్లైమాక్స్‌లు వ్రాయటంలో మేము సాధారణంగా ఫెయిలవుతూ ఉంటాము. ఈ బలహీనత విశ్వనాథ్ సినిమాల్లో కూడా గమనించవచ్చు. నా రచనల్లో చాలా వాటిల్లో క్లైమాక్స్ బలహీనంగానూ, లాగినట్టుగానూ, లేదా సినిమాటిక్‌గానూ ఉంటుంది.

క్లైమాక్స్ ముందు అనుకుని దాని చుట్టూ కథ అల్లటం ఎప్పుడూ మంచి పద్ధతి అని ఈ పుస్తకంలో ఇంతకుముందే చెప్పటం జరిగింది. అలాకాకుండా నవల వ్రాసుకుంటూ పోయి చివర్లో క్లైమాక్స్ ఆలోచిద్దాంలే అనుకుంటే రచయిత ఇబ్బంది పాలుకాక తప్పదు.

అన్నిపాత్రల స్వభావాల్నీ పూర్తిగా విశ్లేషించిన తర్వాత వాటిని ఒక కొలిక్కి తీసుకురావటం, మొదట్లో వేసిన ముడిని జాగ్రత్తగా విప్పటం పాఠకులకి సంతృప్తి కలగజేయటం, నాలుగైదు గొప్ప వాక్యాలతో నవలని ముగించటం - ఇవన్నీ నవల సక్సెస్‌కి దోహదపడతాయి.

ఊహించని విధంగా ట్విస్ట్ ఇవ్వటం, లేక ఊహించిన విధంగానే ముగింపుని చేసి పాఠకులని సంతృప్తిపరచటం - రెండూ పద్ధతులు. ఈ రెండు పద్ధతుల ద్వారా కూడా విజయాన్ని సాధించవచ్చు.

క్లైమాక్స్ ఎప్పుడూ పకడ్బందీగా ఉండాలి. వీలైనంత కుప్తంగా ఉండాలి. ఈ కుప్తత లేకపోవటమే బహుశా ఫెయిల్యూర్స్‌కి కారణం కావచ్చు. చెప్పదల్చుకున్న విషయమంతా చెప్పిన తరువాత క్లైమాక్స్‌ని ఎక్కువగా 'లాగటం' వల్ల నవల యొక్క బిగి సడిలిపోతుంది. అలాగే అవసరమైనంత క్లైమాక్స్‌ని ఆమేరకు వ్రాయకపోయినా పాఠకూడు నిరాశ చెందుతాడు.

నేను బాగా వ్రాశాననుకున్న క్లైమాక్సులు తులసీదళం, వెన్నెల్లో ఆడపిల్ల, అంతర్ముఖం, ప్రేమ మాత్రమే. నేను ఫెయిలైన క్లైమాక్స్‌లు ప్రియురాలు పిలిచె, డైరీ ఆఫ్ మిసెస్ శారద, ఇంకా... మిగతా చాలా నవలలు.

వారం వారం పత్రికకి సీరియల్ అందచేసే పద్ధతిలో కూడా క్లైమాక్స్‌లు ఫెయిలవుతూ ఉంటాయి. అప్పటికి గత ముప్ఫయ్ వారాల నుంచి నవల వ్రాస్తూ ఉండటం వల్ల ఆ నవల మీద మొదట్లో ఉన్న ప్రేమ చివర్లో ఉండదు. అదీగాక, అప్పటికే మరో పత్రికలో మరో సీరియల్ ప్రారంభం కావటం వల్ల మొదటిదాని మీదున్న ఇంట్రెస్ట్ తగ్గిపోతుంది. నా క్లైమాక్సులు ఫెయిలవటానికి కారణం ఇదీ అని నేను భావిస్తున్నాను.

ఒకేసారి నవలంతా వ్రాయటం ఎప్పుడూ మంచి పద్ధతి. వీలైనంతవరకూ ఆ పద్ధతిని అనుసరించటం రచయితలకి అభిలషణీయం

**అంకురం - విస్తరణ**

చివరగా ఒక ముఖ్య విషయం చెప్పి ఈ అధ్యాయం ముగిస్తాను. ఒక 'పాయింట్' దొరగ్గానే నవల ప్రారంభించటం ఎప్పుడూ మంచి పద్ధతి కాదు. అది మనసులో ఒక ఆకారం రూపుదిద్దుకునే వరకూ ఆగాలి. చిన్న పాయింట్ దొరికింది కదా అని నవల ప్రారంభిస్తే, పేజీలు ఎలా పూర్తి చేయాలో తెలియక, అనవసరమైన 'సోది' వ్రాయవలసి వస్తుంది.

కనీసం నాలుగయిదు ముఖ్యమైన ట్విస్ట్‌లు, బలమైన క్లైమాక్స్ దొరికేవరకూ నవల ప్రారంభించకూడదు.

మా దగ్గరికి వచ్చే చాలామంది వర్ధమాన రచయితలు, ఒక పాయింట్ చెప్పి, దీనిమీద నవల వ్రాద్దామనుకుంటున్నామని

అంటారు. మిగతా కథ చెప్పమంటే, ఇంకా ఆలోచించలేదంటారు.

ఉదాహరణకి - సంసార జీవితం పట్ల నిరాసక్తత పెంచుకున్న దంపతుల గురించి నవల వ్రాయటానికి ఒక రచయితకి ఆలోచన వచ్చిన దనుకోండి. ఏయే సంఘటనల ద్వారా ఆ దంపతుల నిరాసక్తతని పాఠకులకి చెపుతున్నాము - అన్న విషయం మీద నవల విజయం ఆధారపడి ఉంటుంది.

ఈ కథాంశంతో ఒక అద్భుతమైన నవల వ్రాయచ్చు. ఇదే కథాంశంతో పేలవంగా కూడా వ్రాయచ్చు. వచ్చిన ఊహ ఎప్పుడూ గొప్పదే దాన్ని ఎలా బిల్డప్ చేస్తామన్న దానిమీద విజయం ఆధారపడి ఉంటుంది.

ఈ 'బిల్డప్' అనేది రకరకాల స్టేజీల్లో పరిపూర్ణతని సంతరించుకుంటుంది.

పై కథాంశంలో భర్త ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే వ్యక్తి అనుకుందాం. రాత్రి డ్యూటీలు ఎక్కువగా ఉండటం భార్యకి అసంతృప్తి.

ఇలా ఆలోచించినప్పుడు రచయిత ఫైర్ స్టేషన్‌కి వెళ్ళి, వారి జీవితాల గురించి కొంచెం వివరణలు సేకరించాలి. అలా అని - నవలంతా ఫైర్ ఇంజన్లు పనిచేసే విధానం, ఫైర్ సర్వీసు దేశానికి చేస్తున్న సేవ - లాటి విషయాలతో నింపకూడదు.

నవల 'ఫైర్‌మెన్' గురించి అయితే అవన్నీ వ్రాయాలి. ఇక్కడ మన కథాంశం కేవలం భార్యాభర్తల మధ్య అసంతృప్తి. కేవలం అదొక్కటే వ్రాస్తే పాఠకులకి బోర్ కొడుతుంది. కాబట్టి - ఆ అసంతృప్తికి కారణాలు వ్రాస్తున్నాం.

అందులో ఒకటి - భర్త ఆలస్యంగా రావటం.

దానికి కారణం - అతడి ఉద్యోగం.

ఫైర్ సర్వీస్‌లో ఉద్యోగాల గురించి పాఠకులకి ఎక్కువ తెలీదు కాబట్టి, అది ఆసక్తికరమైనది కాబట్టి - దాని గురించి కొంతవరకూ వ్రాయొచ్చు. ఇలా వ్రాస్తే రచయిత కృషి పాఠకులకు చేరుతుంది.. భర్త ఏ తాలుకాఫీసులో గుమస్తాగానో కాకుండా ఇలా వైవిధ్యమున్న ఉద్యోగస్తుడిని చేయటంలో రచయిత నేర్పరితనం కనబడుతుంది. పాఠకులకి తెలియనిది చెప్పినట్లు అవుతుంది.

సరే, అసలు విషయానికి వద్దాం.

భర్త ఉద్యోగం వివరణ సేకరించాక భార్య మనస్తత్వం గురించి ఆలోచించాలి. రచయిత తన చుట్టు ప్రక్కల సంసారాల్ని గమనించాలి. వ్యక్తుల్తో చర్చించాలి.

ఇలా సేకరించిన వివరణలన్నీ ఫైల్లో జాగ్రత్తగా పెట్టుకోవాలి.

ఇందులో ఉన్న ఒక గొప్ప ప్రమాదాన్ని రచయిత నివారించాలి. ఒక విషయం గురించి వివరణలు సేకరిస్తున్నప్పుడు అదంతా పాఠకులకి చెప్పాలన్న తపన బయల్దేరుతుంది. ఈ ప్రలోభం నుంచి రచయిత బయటపడాలి. లేకపోతే నవలాకారుడు అవడు. వ్యాసకర్త అవుతాడు. ఇటీవల వచ్చిన ఇన్వెస్టిగేటివ్ రచనలన్నీ ఫెయిలయింది ఇక్కడే

కథాంశం ఒక షేపుకి వచ్చాక రఫ్‌గా స్కెచ్ వేసుకోవాలి. ఇది ఒకో రచయతకు ఒకో పద్ధతిలో ఉంటుంది. ఇదే అధ్యాయంలో "వెన్నెల్లో ఆడపిల్ల" ఏ విధంగా స్టెప్స్ ప్రకారం తయారైందీ సూచించటం జరిగింది.

చివరగా ప్రతీ రచయితా గుర్తించుకోవలసిన ఒక మాట చెప్పి ఈ అధ్యాయాన్ని ముగిస్తాను, "ప్రారంభం - మధ్యలో ఛాప్టర్లు - క్లైమాక్స్" - వీటి పట్ల మనసులో పూర్తి అవగాహన లేకుండా మొదటి అక్షరం వ్రాయొద్దు"

✷✷✷

వచ్చే సంచికలో పాత్రపోషణ గురించిన చిట్కాలు